క్లుప్తంగా

నర్సీపట్నం తహసీల్దార్‌గా రవికుమార్



నర్సీపట్నం: స్థానిక తహసీల్దార్ బి.రవికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అమరావతి సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఇక్కడ తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్ అన్నాజీ రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వర్షం.. రైతుల హర్షం



మాకవరపాలెంలో భారీగా కురుస్తున్న వర్షం

మాకవరపాలెం: భారీ వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మండలంలో 20 రోజులుగా వర్షాలు లేకపోవడం, భారీగా కాస్తున్న ఎండలతో వరి పొలాలు ఎండిపోయే స్థితికి చేరాయి. ఇక మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికీ వరినాట్లు వేయలేదు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అధికంగా ఎండకాయగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సుమారు గంటకుపైగా భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వరి నాట్లు వేసేందుకు, ఎండిపోతున్న పొలాలకు ఎంతగానో ఊపిరినిచ్చిందని చెబుతున్నారు.

నేడు పశువులకు టీకాలు

రోలుగుంట: స్థానిక పశువైద్య కేంద్ర వద్ద బుధవారం పశువులకు రోగ నిరోధక టీకాలు వేస్తామని పశువైద్యాధికారి నూకేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాదిలో లంపీస్కిన్(ముద్దచర్మ) వ్యాధితో అధికంగా పశువులు మరణిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన చికిత్సలు అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే స్థానిక పశువైద్య కేంద్రం వద్ద శిబిరం నిర్వహించి టీకాలు వేస్తున్నామన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి దేవి

రోలుగుంట: పంటల ఈ-క్రాప్ నమోదుపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం డివిజన్ ప్రకృతి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి బి.దేవి అన్నారు. రోలుగుంట మండలం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఉన్నతాధికారులు నర్సీపట్నం డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలనూ అప్పగించారు. మంగళవారం కొంతలంలో ఇక్కడ సిబ్బందికి ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాప్‌లో ప్రకృతి వ్యవసాయ రైతుల డేటా ఏవిధంగా అప్‌లోడ్ చేయాలో వివరించా రు. అనంతరం క్షేత్రస్థాయిలో సిబ్బంది మోదినాయుడు, నిర్మలతో కలసి పంటలను పరిశీలించారు.

60 మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రావికమతం: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా కవగుంటలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది 60 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు పాల్గొని సహాయ సహకారాలందించారు.

రిలే నిరాహార దీక్ష

నాతవరం: తాండవ రిజర్వాయరు మెయిన్‌గేట్ల లీకేజీలు బాగు చేయాలని, నాతవరం నుంచి తాండవ ప్రాజెక్టుకు వెళ్లే తారురోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ రాజాన సూర్యచంద్ర రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి దీక్ష చేపట్టి పలు సమస్యలపై నినాదాలు చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

బూడి మాట.. గిరిజన బాట

దశాబ్దాలుగా సరైన రవాణా సౌకర్యం లేక ఉన్నత చదువులకు దూరమైన గిరిజనులకు ఇక నుంచి డోలీ మోత కష్టాలు తప్పనున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఏడు గిరి గ్రామాలకు రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.9.10 కోట్లతో ఈ పనులు చకచకా సాగుతున్నాయి.



కొత్తవలస నుంచి రాజంపేట వరకు కొండబాటలున్న దృశ్యం



కొత్తవలస నుంచి రాజంపేట గిరి గ్రామం వరకు వేస్తున్న రోడ్డు

- రూ.9.10 కోట్లతో 7 గిరి గ్రామాలకు రోడ్డు నిర్మాణం
- నెరవేరనున్న గిరిజనుల దశాబ్దాల కల
- తొలగనున్న డోలీ మోత కష్టాలు

మాడుగుల: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే శంకరం గిరి పంచాయతీకి రహదారి కష్టాలు తొలగనున్నాయి. పంచాయతీలోని ఏడు గిరి గ్రామాలకు ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేక కొండబాటలలో డోలీ మోతలు తప్పేవి కాదు. వర్షాలు అధికమైతే ఈ గ్రామాల చుట్టూ ఉరకగెడ్డ ఉధృతంగా ప్రవహించడం వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. గెడ్డ ఉధృతి తగ్గే వరకు వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయేవి. కొన్ని సందర్భాల్లో ప్రసవాల కోసం ప్రాణాలకు తెగించి గెడ్డ దాటించాల్సి వచ్చేది. ఈ విధంగా గిరిజనులు పడుతున్న కష్టాలను తెలుసుకున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు డి.గొటివాడ నుంచి రాంపేట గిరి గ్రామం వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డుతోపాటు ఉరకగెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.9.10 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పంచాయతీలోని కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, మామిడిపాలెం గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు వస్తే తప్పని పరిస్థితిలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఉరకగెడ్డ దాటాల్సి వచ్చేదని, ఇకపై వంతెన పూర్తయితే డోలీ మోతలు తప్పుతాయని డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

రోడ్డు చూస్తామనుకోలేదు



మా తాతలు, తండ్రుల నాటి రహదారి కల నేటికి నెరవేర బోతోంది. ఎందరో నేతలు వచ్చారు. మా కష్టాలు విన డమేకాని పనులు చేపట్టలేదు. వర్షాకాలంలో గెడ్డలు దాట లేక పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మా కష్టాలు తెలుసుకుని రోడ్డు, వంతెనలు నిర్మించడం ఆనందంగా ఉంది.

– ఏముకుల దేముడమ్మ, గిరి మహిళ, వెలగలపాడు

గిరిజన కష్టాలు తెలిసిన నాయకుడు



రహదారి సౌకర్యం లేక ఇంత వరకు మా పంచాయతీలోని ఏడు గిరి గ్రామాల నుంచి పలువురు ఉన్నత చదువులకు దూరమయ్యారు. ప్రస్తుతం రోడ్డు నిర్మిస్తున్నారు. ఉరకగెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇవి పూర్తయితే మండల కేంద్రానికి వారపు సంతకు, ఉన్నత చదువులకు వెళ్లడానికి ఇకపై ఇబ్బందులు ఉండవు. డిప్యూటీ సీఎంకు మా గిరి పంచాయతీ ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– సోలం రమేష్, సర్పంచ్ శంకరం

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: విద్యాభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి కోరారు. స్థానిక పాఠశాలలో 6, 7 తరగతులు విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గురుకులంలో అందుతున్న సౌకర్యాలు, విద్యా విధానంపై తల్లిదండ్రులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను బోధించడం, సౌకర్యాలు కలిస్తున్నప్పటికీ తల్లిదండ్రులూ తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. అదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. ఉపాధ్యాయులు సత్తిబాబు, సత్యనారాయణ, రజని, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

డి.పట్టాదారులకు జిరాయితీ హక్కు



తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ప్రభుత్వం 20 ఏళ్ల దాటిన డి.పట్టా భూములను జిరాయితీగా మార్పు చేస్తుందని తహసీల్దార్ ఎస్.ఎ స్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2003 జూన్ 30వ తేదీకి ముందు అసైన్డ్ భూములకు డి.పట్టా పొంది సాగు చేసుకుంటున్న రైతులకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు ప్రభుత్వం కల్పించిందన్నారు. డి.పట్టా పొంది భూముల్లో సాగు చేయకపోతే మార్పు చేయడానికి కుదరదన్నారు. మండలంలో డి.పట్టాదారులంతా వీఆర్వోలకు జెరాక్సు కాపీలు అందజేయాలన్నారు. కోర్టు తగాదాలు, వివాదాస్పదంగా ఉన్న డి.పట్టా భూములను జిరాయితీగా చేయడం కుదరదన్నారు. ఈ విషయమై గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలను ఆదేశించామన్నారు. పైసా ఖర్చు లేకుండా డి.పట్టా భూములు జిరాయితీగా చేస్తామన్నారు.

రాజ్యాంగమే మన ధర్మశాస్త్రం



మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ప్రసాద్

దేవరాపల్లి: భారత రాజ్యాంగమే మన ధర్మశాస్త్రమని, ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రతి పౌరునికి పరిపాలన వ్యవహారాలపై అవగాహన ఉండాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రజాస్వామ్యం-భారత రాజ్యాంగం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగాన్ని చదివి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రేపటి పౌరులుగా సమాజాన్ని ఉన్నత స్థితిలో నిలిపేది మీరేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చి77 ఏళ్లు నిండినా సర్వం అవినీతిమయంగాను అభివృద్ధి నామమాత్రంగాను ఉందన్నారు. పరిపాలన పారదర్శకంగా అధికారులు ప్రజలకు జవాబుదారుతనంతో ఉంటేనే ప్రజాస్వామ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి చిన కన్నబాబు, పారెపల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ బి.రాధ పాల్గొన్నారు.

ఫిర్యాదులను పీడీ దృష్టికి తీసుకెళ్తా



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్

చీడికాడ: ప్రజావేదికలో అందిన ఫిర్యాదులను పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అడిషినల్ పీడీ ఎం.రోజారాణి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదికలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు రూ. 13.19 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో నిర్వహించిన ఆడిట్‌పై సమీక్షించారు. ఈ మేరకు గతంలో తునివలస నుంచి దండిసురవరం వరకు రోడ్డు అంచుల్లో మొక్కలు నాటకుండానే వాటికి నీటి తడులు పేరిట నిధులు దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదు చేసినా సమాధానం చెప్పలేదని మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు అధికారులను నిలదీశారు. దీనిపై పీడీ దృష్టికి తీసుకెళ్లి విచారిస్తామని అడిషనల్ పీడీ తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో జయప్రకాష్, ఏపీడీ బి.శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పశువైద్య సేవలు విస్తృతం

మాడుగుల: వైఎస్సార్ పశువైద్య సంచార అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు మంగళవారం తెలిపారు. పశువులు అనారోగ్యానికి గురై పశువైద్య శాలకు రాలేకపోతే టోల్ ఫ్రీ 1962 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. పశువులున్న చోటకు అంబులెన్స్ వస్తుందన్నారు. చీడికాడ, మాడుగుల మండలాల్లో 80 శాతం పశువులుకు గాలి కుంటు నివారణ టీకాలు వేశామన్నారు.

పార్టీ పెద్దలను కలిసిన సన్యాసిపాత్రుడు




వై.వి.సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు మంగళవారం అమరావతిలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డిలను వేర్వేరుగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంఆ పని చేయాలని సూచించినట్టు సన్యాసిపాత్రుడు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

నర్సీపట్నం/నాతవరం: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల వద్ద మంగళవారం సమగ్ర శిక్ష ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్‌టైం ఉద్యోగులు నిరసన చేపట్టారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. యూనియన్ నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సతీష్, రమేష్, భవాని, రామలక్ష్మి, ధారలకి, పద్మావతి, దేముళ్లనాయుడు పాల్గొన్నారు.

యర్రా అప్పారావుకు విప్ ధర్మశ్రీ పరామర్శ



అప్పారావుతో మాట్లాడుతున్న విప్ కరణం ధర్మశ్రీ

చీడికాడ: ఇటీవల గుండెపోటుకు గురై కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత యర్రా అప్పారావును ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. ఈ మేరకు మంగళవారం చీడికాడలో ఆయన స్వగృహానికి వెళ్లి అప్పారావు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. త్వరగా స్వస్థత చేకూరాలని ఆకాంక్షించారు.

ఖరీఫ్ పనుల్లో రైతుల నిమగ్నం



గవరపాలెంలో దమ్ములు, వరినాట్లు వేసే పనుల్లో రైతులు

కె.కోటపాడు: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో వరినారు ఎదగడంతో వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు వర్షాలు పడడంతో పొలాలను దమ్ములు చేసి వరినాట్లు పూర్తి చేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. పలు గ్రామాల్లో వరినాట్లు పనులు చేస్తుండటంతో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం గవరపాలెం, కె.జె.పురం, కొరువాడ, సింగన్నదొరపాలెం, దాలివలస ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి

చోడవరం పట్టణ కార్యకర్తలతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వార్డు స్థాయి కార్యకర్తలు పూర్తి స్థాయిలో పని చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుడటంతో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వార్డుల వారీగా ముఖ్య కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా వార్డు మెంబర్లు, కన్వీనర్లతో వార్డుల పరిస్థితిపై సమీక్షించారు. సంక్షేమ పథకాలను సచివాలయ, గృహ సారథులతో కలిసి ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, ఆస్పత్రి అభివృద్ధి చైర్మన్ జ్యోతుల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాకీల జమలతోనే వ్యవస్థ బలోపేతం



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీఎం సాధన

రోలుగుంట: బాకీల జమల ద్వారానే డ్వాక్రా సంఘాలుగాని, మన వ్యవస్థగాని బలోపేతమవుతాయని వెలుగు ఏపీఎం కె.సాధన తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల, గ్రామ స్థాయి సామాజిక కార్యకర్తలకు సంఘాలు బలోపేతం, వ్యవస్థ అభివృద్ధిపై సోమవారం ప్రారంభమైన శిక్షణ తరగతులు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ శిక్షణలో సంఘాలకు నిధుల ఎలా వస్తాయి, వాటి వినియోగంపై వెలుగు ఏపీఎం అవగాహన కల్పించారు. గ్రామాఖ్య సంఘాలకు పొదుపు, సభ్యత్వం, సేవా రుసుం, అంతర్గత అప్పులపై వడ్డీ రూపంలోను, బ్యాంకు ఖాతాపై వచ్చే వడ్డీ, పలు రకాలుగా వచ్చే నిధుల వినియోగంపై వివరించారు. రుణాలు శతశాతం జమ చేయడంలో గ్రామాఖ్య, మండల మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఆడిట్ అంశాలపైన అవగాహన కల్పించారు. ప్రాంతీయ సామాజిక ప్రతినిధులు జి.పద్మ, వి.పరమేష్, ఎస్.నాగేశ్వరరావు, వై.భవానీ, అకౌంటెంట్ ప్రవల్లిక పాల్గొన్నారు.

రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలు

చౌడువాడ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ జగన్‌మోహన్



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ జగన్‌మోహన్, అధికారులు

కె.కోటపాడు: పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరంగా వైద్య సేవలందించాలని ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ సూచించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం చౌడువాడ పీహెచ్‌సీకి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల వివరాలను వైద్యాధికారి నిర్మలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతతోపాటు పచ్చదనంతో ఉండేటట్లు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. నూతనంగా రూ.1.70 కోట్లతో నిర్మించిన భవనంలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు వైద్యాధికారి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో కె.శచీదేవి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఆస్పత్రి కమిటీ సభ్యులు బండారు కనక మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి

నాతవరం: వెదురుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త, ఆయా పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో కె.శ్రీగౌరి మంగళవారం తెలిపారు. ఈ పోస్టులతోపాటు గుమ్మడిగొండ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టు జనరల్ కేటగిరీకి కేటాయించామన్నారు. ఈ నెల 23 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు గొలుగొండ ప్రాజెక్టు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై ఒకటో తేదీకి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18 ఏళ్ల నిండి ఉండాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

కె.కోటపాడులో 49,086 మంది ఓటర్లు



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: మండలంలో బీఎల్వోలు నెల రోజుల పాటు 12,274 కుటుంబాలకు ఇంటింటా ఓటరు సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన 62 మంది బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సర్వేలో మరణించిన, డబుల్ ఎంట్రీ, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లును తొలగించగా మండలంలో 49,086 ఓట్లు ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. వచ్చే జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండుతున్న వారి నుంచి ఓటుహక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారన్నారు. సమావేశంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఘనంగా రైవాడ ఎరకాలమ్మ తల్లి ఒడ్డు పండుగ



సారె తీసుకెళ్తున్న మహిళలు

దేవరాపల్లి: రైవాడలో ఎరకాలమ్మ తల్లి అమ్మవారి ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా జరిగింది. తమ ఆరాధ్య దేవత ఎరకాలమ్మను గ్రామస్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రావణ మాసం సందర్భంగా పసుపు కుంకుమలతో పూజించారు. సర్పంచ్ చల్లా లక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.